www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 21 మే 2023

ముమ్మరంగా పూడికతీత పనులు
నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలో ఉపాధిహామీ ద్వారా పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. రూ.5లక్షల అంచనా వ్యయంతో శివ్వారం, కిష్టాపూర్, పౌనూర్ గ్రామ పంచాయతీ పరిధి చెరువుల్లో పనుల నిర్వహణ కొనసాగుతున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు పనుల్లో పాల్గొనే విధంగా గ్రామ పంచాయతీల వారీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని సమయానుగుణంగా పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

సరిహద్దులో తనిఖీలు



వేమనపల్లి : మహారాష్ట్ర తెలంగాణ ప్రాణహిత సరిహద్దు అయిన వేమనపల్లి, వెంచపల్లి తీరంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియా డామినేషన్, ఫెర్రి పాయింట్లను స్పెషల్ పార్టీస్, 50మంది పోలీస్ సిబ్బందితో ముమ్మర తనిఖీ చేశారు. కోటపల్లి, నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాహనాలను ఆకస్మిక తనిఖీ చేసి పడవలో ప్రయాణించే ప్రయాణికులతో, పడవలు నడిపే వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాహనాలను నిలిపి వాహన పత్రాలు, వారి వద్ద సామానులను తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించి తునికాకు అరబెట్టిన ప్రాంతంకి వెళ్లి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దు



నవతెలంగాణ-జన్నారం

రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని మురిమడుగు గ్రామ సర్పంచ్ ఇందనపల్లి భాగ్యలక్ష్మి రాజలింగు అన్నారు. శనివారం మురిమడుగు గ్రామంలో ఐకెపి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర ఇస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలలోనే రైతులు వరి ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ఉప సర్పంచ్ జాడి రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేష్, ఏపీవో బుచ్చన్న, గ్రామస్తులు డాక్టర్ ప్రకాష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండగొర్ల లింగన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దరిగాంలో వైద్యశిబిరం



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని దరిగాం గ్రామంలో శనివారం స్పర్శ సోషల్ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారికి వైద్య సేవలు అందించడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేపర్ మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, గ్రామ సర్పంచ్ టేకం భీమ్‌బాయి, డాక్టర్ రవి కిరణ్, చైతన్య, పేపర్ మిల్లు హాస్పిటల్ సిబ్బంది జయసింహ, సిస్టర్ సుజాత, ఆశా వర్కర్లు దేవి, దుర్పత బాయి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రేపు సీనియర్ సిటిజన్స్ జిల్లా ఎన్నికలు
నవతెలంగాణ-దండేపల్లి

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న సీనియర్ సిటిజన్స్ జిల్లా ఎన్నికలను విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుమండ్ల శంకర్‌గౌడ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 22న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల జరుగుతాయని, ఎన్నికలకు అన్ని మండలాల నుండి వయోవృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వయోవృద్ధులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు కొండ సత్తయ్య, సంఘం నాయకులు గంగన్న, రాజన్న పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : ఎంపీపీ
నవతెలంగాణ - రెబ్బెన

పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ జుమ్డి సౌందర్య అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో స్లాగ్ స్లిప్పులో భాగంగా ప్రతి మొదటి, మూడో శనివారం నిర్వహించే మండల అధికారుల సమీక్ష సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు వారధిగా ఉండాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలు, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కరెంటు సమస్య ఉన్న గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ పోచమల్లు, ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు జమీరొద్దీన్, ఏపీఓ బుచ్చన్న, ఏపీఎం రాజ్‌కుమార్, ఎంపీఓ అమ్జత్‌పాషా, ఏఈ సోని, ఎంఈఓ వెంకటస్వామి, డాక్టర్ సుజిత్, విద్యుత్ ఏఈ ఇమాన్‌ఖాన్, ఆస్పత్రి సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలను ఏడీఏ రాజులనాయుడు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు తిరుపతి, ఎంపీటీసీ దూగుంట రాజన్న, తహసీల్దార్ సరిత అందజేశారు. ఏడీఏ రాజులనాయుడు మాట్లాడుతూ 65 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు అందజేస్తున్నామని, 20 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని ఏఈఓలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, ఏఈఓ లావణ్య, రైతులు పాల్గొన్నారు.

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు
నవతెలంగాణ - రెబ్బెన

హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, న్యాయ పర్యావరణ శాఖ మంత్రి శ్రీ అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రజా ప్రతినిధులతో కలిశారు. రెండో తిరుపతిగా పేరుగాంచిన మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు రెండు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ కోసం వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గంగాపూర్ ఆలయ చైర్మన్ ఓల్లోజుల వెంకటేశం చారి, నంబాల మాజీ ఎంపీటీసీ కొవ్వూరు శ్రీనివాస్, బీఆర్ఎస్ యువ నాయకులు గుంపుల విమలేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అధునాతన దోబీఘాట్ నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని దస్నాపూర్ వార్డులో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దోబీఘాట్‌ను నిర్వహించడానికి రజక సంఘాల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దోబీఘాట్ నిర్వహణకు 22 నుండి 27 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖలో నమోదు చేసుకున్న రజక సంఘాలకు, మహిళ సమాఖ్యలకు కేటాయించడానికి తమకు అధికారం ఉందని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు

నవతెలంగాణ-భైంసా





తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే తాము ముందుకు సాగి హక్కులను సాధించుకుంటామని ఐకెపి వివోఏలు అన్నారు. సమ్మెలో భాగంగా శుక్రవారం రాత్రివేళ బతుకమ్మ ఆడుతూ జాగరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రం వస్తే సమస్యలు పరిష్కరిష్కారమవుతాయనుకుంటే మళ్లీ రోజుల తరబడి పోరాటం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం దిగి రావాలని కోరారు. తామేం గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు మండలాల వివోఏలు ఆటపాటలాడుతూ జాగరణ చేశారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుంచడానికి ప్రభుత్వం చేసిన కృషిలో తాము భాగస్వాములమేనని, ప్రభుత్వం తమ వైపు దృష్టి సారించాలని పేర్కొన్నారు. కేవలం రూ.3900 జీతం సరిపోదని, కనీస వేతనం ఇచ్చి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తానూర్, లోకేశ్వరం, కుభీర్, భైంసా మండలాల నుండి వివోఏలు పెద్ద మొత్తంలో తరలిరావడంతో ఎంపీడీవో కార్యాలయ ఆవరణ జాతర వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమంలో వివోఎ సంఘం జిల్లా అధ్యక్షురాలు జైశీల, నాయకులు సాయిబాబా, పరమేశ్వర్, విఠల్, దేవిదాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముందుగా వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి యాసంగి రైతుబంధు 15కోట్ల46లక్షలు రైతు ఖాతాల్లో జమ అయ్యాయని, రైతుబీమా 37మంది రైతులకుగాను 30 మంది రైతు నామిని ఖాతాల్లో రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.కోటీ50లక్షలు జమ అయ్యాయని పేర్కొన్నారు. మొక్కజొన్న పంట గురించి సభ్యులు అడుగగా చిన్నచిన్న పొరపాట్ల వల్ల ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని వివరించారు. అలాగే 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. బీరవెల్లి సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి విద్యుత్ స్తంభాలు వంగి తీగలు వేలాడుతున్నాయని, సవరించాలని సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాలు పడక ముందే విద్యుత్ సమస్యలను పూర్తి చేయాలని ఏఈ రాజేందర్‌ను ఆదేశించారు. స్వర్ణ ప్రాజెక్టు కాల్వల మరమ్మత్తులు పూర్తి చేసి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీపీ కల్పజేసుకొని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, నీటి పారుదల అధికారులకు సూచించారు. జూన్ మాసంలో రెండవ విడత 358 మంది గొల్లకుర్మ లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ ఉంటుందని పశువైద్యాధికారి ముక్తార్ తెలిపారు. అన్ని గ్రామాల్లో పశువులకు నట్టల నివారణ చర్యలు చేపట్టామని వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, సొసైటీ ఛైర్మెన్ మాణిక్‌రెడ్డి, అడెల్లి ఛైర్మెన్ చందు, ఎంపిడిఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టీ)

సిర్పూర్ నియోజకవర్గంలో ప్రధానమైన సమస్యలు కొన్నేండ్ల నుండి పరిష్కారం కాకుండా అలాగే ఉండిపోయాయని, వాటిని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దృష్టి సారించి పరిష్కరించే దిశగా చూడాలని బీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మండల బీఎస్‌పీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూపెల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రజినీకాంత్, భరత్, మండల కార్యదర్శులుగా రాజశేఖర్, హన్మంతు, రాంచందర్, మైనార్టీ మండలాధ్యక్షుడిగా ఫర్వేజ్ హైమద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిర్పూర్‌లో నాగమ్మ చెరువులో బుద్ధ విగ్రహం పెట్టడం మంచి పరిణామమని, దీనికి బుద్ధిస్టు, బీఎస్‌పీ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గతంలో ప్రభుత్వాలు హామీ ఇచ్చి పూర్తికాకుండా నిలిచిపోయిన వాటిని పూర్తిచేస్తే రైతులు, ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పలు మండలాల్లో ఉన్న సమస్యలను కూడా గుర్తించి ప్రధానంగా సిర్పూర్ మండలంలో బస్టాండ్ నిర్మాణం కోసం మూడేండ్ల క్రితం స్థలం చూపించి తాత్కాలికంగా రేకులతో నిర్మించారని తెలిపారు. దీనిపై కూడా దృష్టిసారించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉట్నూర్ : రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుధారాణి అన్నారు. శనివారం మండలంలోని దంతన్‌పల్లి, శాంతినగర్, బీర్సాయిపేట్ గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ పంద్ర జైవంత్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాసంగిలో వరి పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుందన్నారు. ఇటీవల వర్షాల కారణాంగా దెబ్బతిన్న పంటలను సైతం కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్-ఎ రకానికి 2060, సాధారణ రకానికి రూ.2040 కల్పిస్తున్నామన్నారు. రైతులందరూ తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐకేపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పంటలు కొనుగోలు చేయాలని బీజేపీ నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతు కష్టపడి పంట పండిస్తే ప్రభుత్వం కొనడానికి కొర్రీలు పెడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ ధ్వజమెత్తారు. శనివారం రైతులతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయం ముందు పంటను పోసి ధర్నా నిర్వహించారు. పండించిన పంటకు కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జొన్నకు రేటు పలుకుతుందని, పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న నమ్మకంతో పంట పండించారన్నారు. కానీ ప్రభుత్వం ఎకరాకు ఐదు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుందని ప్రకటించడంతో రైతులు నివ్వెరపోయారన్నారు. పంటను అమ్ముకోవడానికి ఒకరి ముందు మోకరిల్లాల్సిన పరిస్థితిని కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందని మండిపడ్డారు. వెంటనే రైతు పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పక్షం రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పెట్టుబడికి డబ్బులు అవసరమవుతాయని, ప్రభుత్వం వెంటనే పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆకుల ప్రవీణ్, జోగు రవి, విఠల్, అధినాథ్, లోక ప్రవీణ్‌రెడ్డి, రాందాస్, దినేశ్ మటోలియా, రమేశ్, రాజు, రాకేశ్, రఘుపతి, దయాకర్ పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



రామకృష్ణాపూర్ : ఆర్‌కె ఓసిపి గనిపై కార్మికులు వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వైద్యాధికారి డాక్టర్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఎండలో ఎక్కువసేపు తిరగొద్దని, నీరు ఎక్కువ తీసుకోని శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని తెలిపారు. నిమ్మ పండ్ల రసాలు తాగాలని, ఆహారపు అలవాట్లు మార్పు చేసుకోవాలని, ఎండలో వెళ్లేటప్పుడు తలకు టోపీ, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. ఆయిల్ పదార్థాలు తినవద్దని మద్యపానం, మాంసం తగ్గించాలని, ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు బీపీ ఉన్నవారు తగు జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కె ఓసిపి ఇన్‌చార్జి మేనేజర్ రామరాజు, సంక్షేమ అధికారి వంశీ, కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ముఖీం

ఆదిలాబాద్‌టౌన్ : బీజేపీ మైనార్టీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ ముఖీమ్ అహ్మద్ నియమితులయ్యారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఏండి అఫ్సర్ పాషా ఈ నియామక పత్రాన్ని శనివారం జారీ చేశారు. తమపై నమ్మకంతో మైనార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎండి అఫ్సర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డికి ముఖీం ధన్యవాదాలు తెలిపారు.

ఉన్నత అవకాశాల కోసం పట్టుదలతో చదువుకోవాలి
- అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి



నవతెలంగాణ - రెబ్బెన

ఉన్నత అవకాశాల కోసం పట్టుదలతో చదువుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అన్నారు. శనివారం వంకులంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నత అవకాశాలు అందుకొనేలా పట్టుదలతో చదువుకోవాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న అంశాలపై ప్రదర్శనను ఆమె తిలకించారు. విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో స్పష్టంగా మాట్లాడడం ఆనందదాయకమన్నారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా ఆహ్లాదకరంగా వివిధ అంశాల్లో అభ్యాసన చేస్తున్న విద్యార్థులను అభినందించారు. వివిధ అంశాల్లో ఆహ్లాదకరమైన అభ్యాసనను ఈ కేంద్రం ద్వారా కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు జాడి ప్రభాకర్‌ను, నిర్వాహకులు ఎం రాజకమలాకర్‌రెడ్డిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఏవులె ప్రకాష్, వార్డుసభ్యులు జాదవ్ ప్రేమ్‌దాస్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

సీహెచ్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో ఎంపీపీ పంద్రా జైవంత్‌రావుతో కలిసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ జాదవ్ మాట్లాడుతూ లేబర్ కార్డ్ ఉన్న నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వైద్యాన్ని గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లి పేదలకు వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధవులే బాలాజీ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, హెల్త్ క్యాంప్ కో ఆర్డినేటర్ సూఫీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలు, పెరుగు తీసుకున్న వారికి రేబిస్ వ్యాక్సిన్



నవతెలంగాణ - చింతలమానేపల్లి

కుక్క కరిచిన దూడ గేదె పాలు తాగగా, ఆ గేదె పాలు, పెరుగు వాడిన పలువురికి శనివారం మండల కేంద్రంలో రేబిస్ వ్యాక్సిన్ వేశారు. కాసబోయిన నానయ్య గేదె దూడను 15 రోజుల క్రితం కుక్క కరిచింది. ఎప్పటిలాగే వాడకందారులకు గేదె పాలు, పెరుగు పోశారు. వారం క్రితం దూడ చనిపోవడంతో పాలు, పెరుగు తీసుకున్నవారు భయబ్రాంతులకు గురయ్యారు. దీంతో మండల కేంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి 300 మందికి రేబిస్ వ్యాక్సిన్ వేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మహేందర్, ఎంపీఓ సుధాకర్‌రెడ్డి ఘటనపై ఆరా తీశారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ ఇంద్ర, ఏఎన్ఎం తార్సినా, రోస్ని, ఆశా వర్కర్స్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంధన శక్తిని పొదుపుగా వాడాలి



నవతెలంగాణ-నస్పూర్

ఇంధన శక్తిని పొదుపుగా వాడుకుంటేనే రాబోవు తరాలకు భవిష్యత్తు అని ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్కే5 గనిలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ విద్యుత్‌ను వృథా చేయకుండా లైట్, ఫ్యాన్, ఏసీ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అవసరానికి అనుగుణంగానే వినియోగించాలని సూచించారు. ప్రతి చిన్నపనికి ద్విచక్రవాహనం, కార్లు వాడకుండా కాళ్లకు పనిచెబితే పెట్రోల్, డీజిల్ ఆదాతో పాటు ఆరోగ్యానికి సైతం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, అండర్ మేనేజర్ రాజమల్లు, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ నీలం సదయ్య, సూపర్‌వైజర్లు, మైనింగ్ స్టాఫ్, యూనియన్ల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
ఆదివారం 21 మే 2023

ప్రగతి సాధిస్తున్న పల్లెలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్



పారిశుధ్యంలో పల్లెలు ప్రగతిని సాధిస్తున్నాయని డీఎల్పీఓ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని బన్సపెల్లి, సాంగ్వి గ్రామాలలో ఆయన పర్యటించారు. గ్రామాల్లోని డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను డీఎల్పీఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనాలలో మొక్కల పెంపకం చేపట్టిన తీరును, డంపింగ్ యార్డుల్లోని చెత్త సేకరణ అంశాలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అనంతరం నర్సరీలో మొక్కలను నాటాడు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓలా పద్మ విక్రం, ఎంపీఓ అజీజ్ ఖాన్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాగోబా వనంలో క్లీన్ అండ్ గ్రీన్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జీవవైవిధ్యంలో భాగంగా మండలంలోని కెస్లాపూర్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నాగోబా వనంలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. ముందుగా గ్రామం నుంచి నాగోబా వనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఆర్ఓ సంతోష్ ఆధ్వర్యంలో నాగోబా వనంలో చెత్తచెదారం, ప్లాస్టిక్‌ను ఏరి పారేశారు. మొక్కలకు నీటిని అందించారు. గత నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్, ఎస్పీ విష్ణు వారియర్‌లు నాటిన మొక్కలు ఆకు పచ్చగా దర్శనం ఇస్తున్నాయి. ప్రతి నెలకోసారి తమ శాఖ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. దీనితో కాలుష్యం నివారణతో పాటు జీవకోటి ప్రాణికి మొక్కలే ఆధారమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ నర్సయ్య, రాజేందర్, రాజు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



బాసర



ముధోల్

నవతెలంగాణ-బాసర

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ విస్తరణ అధికారి అజయ్, ఏఎస్సై లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో నకిలీ విత్తనాల బారి నుండి రైతులను కాపాడేందుకు వ్యవసాయ, పోలీస్‌శాఖ సంయుక్తంగా మండలంలో ఎరువులు, విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, రసాయనాల ప్యాకెట్లను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అవసరమైతే పీడీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఏఎస్సై లక్ష్మణ్ హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విడిగా రశీదులు ఇవ్వాలని అన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. అందుకు రసీదు కూడా రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలని అన్నారు. ఆయా దుకాణాల్లో స్టాక్‌ను, రిజిష్టర్లను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే అమ్మాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని అన్నారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు లూజ్ పత్తి విత్తనాలు అమ్మడానికి వస్తే వ్యవసాయ శాఖ, పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కుభీర్ : వానకాలంలో విత్తుకునే విత్తనాలు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలని మండల వ్యవసాయ అధికారి వికార్ హైమద్, ఎస్సై షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న ఎరువులు, విత్తనాలకు సంబంధించి పలు రికార్డులను, లైసెన్స్ తనిఖీ చేశారు. దీంతో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులకు వానకాలంలో నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసి వారికి ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకొని, వారికి సంబంధించిన లైసెన్స్‌లను రద్దు చేస్తామని అన్నారు.

ముధోల్ : వ్యవసాయ విత్తన, ఎరువులు దుకాణాదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముధోల్ సీఐ వినోద్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తరోడ, ఎడ్‌బిడ్, బ్రహ్మంగావ్‌తో పాటు ఆయా గ్రామాలలో ఉన్న విత్తన, ఎరువుల దుకాణాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలో నిల్వ ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లను పరిశీలించి, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దుకాణదారులు ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా కొనుగోలు బిల్లులు ఇవ్వాలని అన్నారు. అలాగే విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతతో పాటు, ఎక్స్‌పైరీ డేట్ ఉన్నవి విక్రయించాలని పేర్కొన్నారు. లేనియెడల నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని అన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై సాయికిరణ్, ఎస్సై సుదర్శన్, ఏఈఓలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కుభీర్

కడెం : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలలో ఖానాపూర్ సీఐ బి. నారాయణ, మండల వ్యవసాయ శాఖ అధికారి సంధ్యారాణి, ఎస్సై కొసన రాజుల ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా మండలంలోని అన్నీ ఫర్టిలైజర్ దుకాణాలలో, గోదాంలలో ఉన్న విత్తనాలు, ఎరువులు వాటి ప్యాకెట్ల లేబుల్లను పరిశీలించి, రికార్డులను, వారి లైసెన్స్‌లను తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు నకిలీ విత్తనాలను కాకుండా జాగ్రత్తగా చూసుకొని కొనుగోలు చేయాలని తెలిపారు. ఎస్సై రాజు నకిలీ విత్తనాల కేసుల పాత నేరస్తుడు ఆత్రం ఇస్రూని మండల తహసీల్దార్ ముందు హాజరు పరిచి బైండవర్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సారంగాపూర్ : నకిలీ విత్తలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు కౌట్ల(బి), స్వర్ణ గ్రామాల్లోని ఎరువుల, విత్తన దుకాణాల్లో శనివారం వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. నకిలీ కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలతో పాటు దుకాణాల లైసెన్స్ లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

దిలావర్‌పూర్ : ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు, పోలీసులు శనివారం మండలంలోని పలు ఎరువుల, విత్తనాల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి) మండల కేంద్రాలతో పాటు సిర్గాపూర్, గుండంపల్లి, చాక్‌పల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ నిర్వహించారు. ఎరువులు, నకిలీ విత్తనాలు, నిషేధిత విత్తనాలు, రసాయన మందులు, రిజిస్టర్లను పూర్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మల్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ అమాయక రైతులకు నిషేధిత, కాలంచెల్లిన విత్తనాలు, ఎరువులు అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై గంగాధర్, ఏఎస్సై మాన్‌సింగ్, దిలావర్‌పూర్ ఏఓ స్రవంతి, నర్సాపూర్ ఏఓ సాయికిరణ్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

నార్నూర్ : నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసగిస్తున్నారని శనివారం టాస్క్ ఫోర్స్ టీమ్ సిబ్బంది గాదిగూడ మండల కేంద్రంతో పాటు లోకారి(కే) గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించారు. దుకాణాలలో ఖరీఫ్ సీజన్ కోసం ముందుగా నిల్వ ఉంచిన విత్తనాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం ద్వారా ఆమోదం పొందిన విత్తనాలు సేంద్రియ ఎరువులను మాత్రమే అమ్మి రైతులకు రశీదు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. వారి వెంట ఏఓ ఝాడి దివ్య, ఏఈఓ కొండిబా రావ్ డీలర్లు ఉన్నారు.

ఎంపీడీఓగా శేఖర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



నూతన ఎంపీడీఓగా ఎస్.శేఖర్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కుబీర్ నుండి లక్ష్మణచాంద మండలానికి డిప్యూటేషన్‌పై వచ్చినట్లు తెలిపారు. నూతన ఎంపీడీఓను పలువురు నాయకులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ మోహన్ దిలావర్‌పూర్ మండలానికి డిప్యూటేషన్ మీద వెళ్లారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-సిరికొండ

గత నాలుగు రోజుల కింద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని గాయపడ్డ సంఘటనలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో, వైద్య ఖర్చుల కోసం సిరికొండ గ్రామస్తులు, వ్యాపారస్తులు కలిసి విరాళాలు సేకరించారు. దాదాపుగా రూ.35వేలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. చికిత్స పొందుతున్న నర్సయ్య తొందరగా కోలుకోవాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్మద పెంటన్న, ఎంపీటీసీ పర్వీన్ లతీఫ్, ఉపసర్పంచ్ తోకల చిన్న రాజన్న, నాయకులు ఇక్బాల్, రంజాన్, లస్మన్న, లక్ష్మణ్, నర్సయ్య, అఫ్సర్, విజయ్, స్వామి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వీఆర్ఏల సంఘం ఉపాధ్యక్షుడు రవి మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కెల్ అమలు చేస్తూ, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తున్నామని క్యాబినెట్ మీటింగ్‌లో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేసి, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విశ్వనాథ్ పటేల్, వీఆర్ఏలు రమణ, సాయి, సాయిబాబా పాల్గొన్నారు.

వాయిదా పడ్డ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-తాంసి

మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీఓ భూమయ్య తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించడానికి నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మొత్తం ఐదుగురు ఎంపీటీసీలు, ఎంపీపీ మంజుల హాజరయ్యారు. ఎంపీటీసీలు సమావేశానికి రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

ఇచ్చోడ ఎఫ్ఆర్ఓ మృతి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల అటవీశాఖ ఎఫ్ఆర్ఓ పాండురంగ్ మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో ఆయనకు అపెండిక్స్ ఆపరేషన్ జరిగింది కాగా ఆయన ఆస్పత్రిలో ఉన్న బాత్‌రూమ్‌కి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కాలుజారి కింద పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబీకులు నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతని మృతి పట్ల అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు నార్నూరు మండలం, భీంపూర్ గ్రామంలో జరగనున్నట్టు సమాచారం.

చేపల మార్కెట్ నూతన భవన పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో ఇటీవల చేపల మార్కెట్ నూతన భవనాన్ని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.65లక్షల నిధులతో నూతనంగా చేపల మార్కెట్ భవనాన్ని నిర్మాణం చేసుకొని ప్రారంభించుకున్నామని అన్నారు. చేపల విక్రయించే వారికి అనుగుణంగా ప్లాట్ ఫామ్స్ సిద్దాం చేసామని తెలిపారు. చేపలు విక్రయించే వారికి, కొనడానికి వచ్చే ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని హంగులతో నిర్మాణం చేయటం జరిగిందని అన్నారు. చేపలు డ్రెస్సింగ్ కొరకు ప్రత్యేక షేడ్స్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఫాన్స్, లైటింగ్, నీరు, ఇతర వసతులు కల్పించటం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న చేపల మార్కెట్ నూతన భవనంలో ప్రజలకు అందుబాటులో రానుందని అన్నారు. మార్కెట్ ఆవరణంలో అద్భుతమైన చేపల విక్రయానికి సంబంధించిన వాల్ పెంటింగ్స్, పచ్చధనం, పార్కింగ్, వంటివి ఉన్నాయన్నారు. చైర్మెన్ వెంట కమిషనర్ సీవీఎన్ రాజు, టీపీఓ సుమలత, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, స్థానిక కౌన్సిలర్ రఫీ, భూపతి, గంగపుత్ర సంఘం సభ్యులు ఉన్నారు.

జన్మదినం సందర్భంగా క్రీడా సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-బేల

మండలంలోని మనియార్‌పూర్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం గ్రామయూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మనియార్‌పూర్ గ్రామానికి చెందిన బజరంగ్ యూత్ సభ్యులకు క్రికెట్ కిట్, బ్యాట్‌మెంటన్ కిట్, వాలీబాల్‌కిట్, ఆటవస్తువులను అందజేయడం పట్ల యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జన్మదినాన్ని పురస్కరించుకొని యూత్ సభ్యులు కేక్ కట్ చేసి తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న యువతకు క్రీడా సామాగ్రిని పంపిణి చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, బేల మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు విఠల్, ఎండీ అఖిల్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు మాడవి చంద్రకాంత్, మాజీ సర్పంచ్ రూప్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంభీర్ ఠాక్రే, సూర్యబాన్, విపిన్ ఠాక్రే, అవినాష్ గోడే, రాకేష్ బాన్కర్, బొక్రే శంకర్, నరేందర్, మున్నా పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తులసిరాం శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మెన్ జనార్దన్ రాథోడ్ గ్రామానికి వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ముందుగా తులసిరాం పార్థివ దేహం వద్ద నివాళులర్పించి బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండాను పార్థివ దేహంపై ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

సంఘం నూతన జిల్లా అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జాదవ్ రెడ్డి నాయక్‌ను శనివారం మండలకేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్ స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్‌లు ఘనంగా సన్మానించారు. సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, యశ్వంత్ రావ్ చవాన్, ధర్మేందర్ ఏఈ, విఠల్ ఈఈ, జాదవ్ బాలాజీ, పెసా కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్, కాంతారావ్ దుర్గే, జ్ఞానోబా పుష్కర్, వసంత్ ఆడే, బిక్కు చౌహాన్, హరిచంద్, అనిల్ నాయక్, దేవుక బాయి, భారత్, సదానంద్, దిలీప్, మహేందర్, సురేష్, విశ్వనాథ, రాణా ప్రతాప్, సురేష్, ప్రేమ్ సింగ్, విలాస్, సంతోష్, అమరేందర్, మనోజ్, మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో సీడీపీ నిధుల నుండి రోడ్డు నిర్మాణం కొరకు రూ.3 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గ్రామంలో నుండి స్మశానవాటిక వరకు రోడ్డు పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ పడిగేల గంగాధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ అనిత సురేష్, ఎంపీటీసీ గణేష్, ఏఈ విజయ్‌రెడ్డి నాయకులు రమణ, సుదర్శన్, రమేష్, సాయన్న, రాజేందర్ మహిపాల్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

వీఓఏల డిమాండ్లు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఖానాపూర్



ఐకేపీ వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలో ఐకేపీ వీఓఏలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా అటువైపుగా వచ్చిన ఎస్సై ర్యాలీలకు పర్మిషన్ లేదంటూ అనడం, ఆందోళన చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్‌ను పక్కకు లాగడంతో వీఓఏలు ఆందోళన మరింత ఉధృతం చేశారు. పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మెన సురేష్ మాట్లాడుతూ శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. తనపై ఎస్సై దురుసుగా ప్రవర్తించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐకేపీ వీఓఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు స్వప్న, లావణ్య డివిజన్ కార్యదర్శి బి.రవీందర్, డివిజన్ సహాయ కార్యదర్శి స్రవంతి, నరేష్, కోశాధికారి సురేష్, మండల నాయకులు ముత్తన్న, అశోక్, స్వామి, పల్లవి, విజయ నాగార్జున పాల్గొన్నారు.

వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ యూనివర్సిటీలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న వివాదాలు పరిష్కరించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోనీ భగత్ సింగ్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ యూనివర్సిటీలో గత కొన్ని నెలల నుండి జరుగుతున్న వివాదాల కారణంగా పరిపాలన స్తంభించి, అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ముఖ్యంగా రిజిస్ట్రార్ పోస్టు కేంద్రంగా ఈ వివాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. వీసీ, ఈసీ, నవీన్ మిట్టల్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రయోజనాలను గాలికొదిలి, తమ మాటే నెగ్గాలని ఎవరికి వారు ప్రయత్నిస్తుండటం వివాదాలకు ప్రధాన కారణమని అన్నారు. ఎవరికి అనుకూలమైన వ్యక్తిని వారు, రిజిస్ట్రార్‌గా పెట్టుకుని యూనివర్సిటీపై ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వీసీ, ఈసీ, నవీన్ మిట్టల్‌ల మధ్య జరుగుతున్న అంతర్గత పోరులో యూనివర్సిటీ ప్రతిష్ట మరింత దిగజారిందని అన్నారు. విద్య, పరిశోధనలకు నిలయంగా ఉండాల్సిన యూనివర్సిటీ, వివాదాలకు నిలయంగా, పైరవికారులకు అడ్డాగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీలో జరుగుతున్న వివాదాలకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. 2017 నుండి తెలంగాణ విశ్వ విద్యాలయంలో జరిగిన అన్ని రకాల నియమకాలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ నియామకాలు, పదోన్నతులను రద్దు చేయాలని అన్నారు. యూనివర్సిటీలో అకడమిక్ వాతావరణాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆకాశ్, జిల్లా నాయకులు రాజారాం, శ్రావణ్, కిరణ్, ఉదయ్ పాల్గొన్నారు.

సంజీవ్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివి

నవతెలంగాణ-తాంసి



పొన్నారి గ్రామ సర్పంచ్ చింతలపెల్లి సంజీవ్‌రెడ్డి గ్రామానికి చేసిన సేవలను గ్రామస్తులు ఎప్పటికి మరచిపోరని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. శనివారం పొన్నారి గ్రామపంచాయతీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. గ్రామస్తులు ప్రజాప్రతినిధులు పలువురు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలనే ఆలోచనతో ఈ మధ్య కాలంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామాన్ని ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్ది రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని అన్నారు. వారు మరణించడం గ్రామానికి తీరనిలోటు అయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చెర్మెన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రేఖా రఘు, ఉపసర్పంచ్ అశోక్, నాయకులు కిరణ్, రమణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-బేల

గత ప్రభుత్వాలు గుర్తించలేని కుమురం భీం ఆశయాలను కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించిందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని రంఖం గ్రామంలో ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహాన్ని, గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు,

ఆచారాలను భద్రపరుస్తూ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లతో ఆదివాసీ భవన్ ఏర్పాటు చేసి చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, జక్కుల మధుకర్, సతీష్ పవార్, కిషన్ వైద్య, సునీల్ గోడం, సర్పంచ్ యశోద శత్రు ఘన్ పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్



కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త రోడ్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెట్టం శారద(33) ఆరు సంవత్సరాల క్రితం వివాహం కాగా, భర్తతో గొడవల కారణంగా గత కొంతకాలంగా అమ్మ వాళ్ళ ఇంటి వద్ద ఉంటోంది. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి సాద్విత నాలుగేండ్ల కూతురు ఉంది. సోదరుడు గోపు సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

ప్రేమ విఫలమై సింగరేణి కార్మికుడు ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్



తను ప్రేమించిన అమ్మాయికి వివాహమైందని మనస్థాపంతో సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన 4వ వార్డ్ లోని గణేష్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పకుర్తి ప్రణయ్ కుమార్ (23) ఎస్ఆర్పీ-3 గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తను ప్రేమించిన అమ్మాయికి వివాహం అయినప్పటి నుంచి మనోవేదన గురై శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి ఇనుప రాడుకు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజేష్ పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రేపటి ధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-హాజీపూర్

కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్ల రామన్న, గుర్రాల రాజావేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఎస్వోలు, సీఆర్‌టీలు ఇతర సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన పీఆర్సీకి అనుగుణంగా బేసిక్ పే వర్తింపజేయాలన్నారు. అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులు ఆపాలన్నారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, జిల్లాలో ఉన్న 18 కేజీబీవీలు, యు ఆర్ఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ మే 22న మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు తప్పకుండా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆసిఫాబాద్ : కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార్యానికి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వైద్య శాంతి కుమారి, సోయం ఇందు రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్పదని, ఇప్పటివరకు సాధించుకున్నవన్నీ కూడా పోరాటాల ద్వారానే సాధ్యమైనట్లు తెలిపారు. జిల్లాలోని కేజీబీవీ, యూఆర్ఎస్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సకాలంలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నెలాఖరుకల్లా ఏక రూప దుస్తులు అందాలి

• జిల్లా కోఆర్డినేటర్ సత్తయ్య జంబోజు

నవతెలంగాణ-అసిఫాబాద్



ఏక రూప దుస్తులు ఈ నెలాకురుకల్ల పాఠశాలలకు అందజేయాలని జిల్లా కోఆర్డినేటర్ సత్తయ్య జంబోజు అన్నారు. శనివారం మండలంలోని తుంపల్లి లోని టైలర్ ఏజన్సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1071 పాఠశాలలో 53,101 విద్యార్థులకు 106202 జతల ఏక రూప దుస్తులు కుట్టడం ఈ నెల చివరిలోగా పూర్తి చేయాలన్నారు. తుంపెల్లిలోని టైలర్ ఏజ యూనిఫామ్స్ యొక్క ప్రగతిని సమీక్షించారు. ఏక రూప దుస్తులు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులకు అందజేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు టైలర్ ఏజెన్సులను సందర్శించి తమ పరిధిలోని పాఠశాలల ఏకరూప దుస్తులను సరైన సమయంలో కుట్టించి ఇచ్చే విధంగా సమన్వయం చేయాలని కోరారు. అదేవిధంగా మండల విద్యాధికారులు మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వయించుకొని ప్రతి విద్యార్థికి ఏకరూప దుస్తులు అదే విధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, సీఆర్పీ సుభాష్, స్టిచింగ్ ఏజెన్సీ భీమయ్య ఉన్నారు.

అటల్ టింకరింగ్ శిక్షణ విద్యార్థులకు ఉపయోగదాయకం

• జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-అసిఫాబాద్



యూనిసెఫ్ విజ్ఞాన్ ఆశ్రమ్ వారి సౌజన్యంతో నిర్వహించిన వేసమి అటల్ టింకరింగ్ శిక్షణ శిబిరం ఎంతగానో ఉపయోగ పడుతుందని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ ఎస్ఎస్ బాలుర పాఠశాలలో ఈ నెల 17 నుంచి 20వ తేది వరకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగు రోజుల శిక్షణ శిబిరం 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బేసిక్స్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్ ఎలక్ట్రానిక్స్ లపై అవగాహన పెంచుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అధునాతన సాంకేతిక పరిజ్ఞానమును అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ జ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసుకొని తమ చుట్టూ ఉన్న సమస్యలకు పరిష్కార మార్గాలను అనేశించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, విజ్ఞాన్ ఆశ్రమ్ ప్రతినిధులు పురుషోత్తం, కిషోర్ గైక్వాడ్, ల్యాబ్ ఇన్‌ఛార్జి వి.లక్ష్మణ్, ఉపాధ్యాయులు దీపక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-భీమిని

పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. శనివారం మండలంలోని బిట్టురుపల్లి గ్రామపంచాయతిలో ఇంచార్జి ఎంపీడీఓ గౌతమితో కలిసి ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లైఫ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా బిట్టురుపల్లి గ్రామపంచాయతీలో రోజు వారి పారిశుధ్య పనులను పరిర్యవేక్షించారు. లైఫ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా రాంపూర్‌లోని చెరువుని సందర్శించి చెరువు నీటిలోని కలుషితమైన చెత్త చెదారన్ని, పిచ్చి మొక్కలను గ్రామ ప్రజలతో కలిసి తొలగించారు. అనంతరం చిన్న తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య కార్యక్రమలను పరిశీలించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు రోజువారీ తడి పొడి చెత్త ఏవిధంగా వేరు చేయాలో ప్రజలకు వివరించారు. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా వారంలో ఎన్ని సార్లు చెత్త తీసుకెలుతున్నారో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా వాడుతున్న నీరు వృదాగా పోకుండా ఆ నీటితో పెరటి తోట చేసుకోవచ్చని సూచించారు. చిన్న తిమ్మాపూర్ పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి పాత్‌వే లోని గడ్డిని తొలగించాలని ఆదేశించినారు. ప్రజలందరితో కలిసి పర్యావరణ పరిరక్షణ, రిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డీఎల్పీఓ ఏ.పణిందర్‌రావు, ఎంపీఓ షేక్ సఫ్దర్‌అలీ, స్థానిక సర్పంచులు గడ్డం ఎల్లగౌడ్, ఇందూరి భూమయ్య, ఏపీఓ భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు ఎండీ.జాహేద్, కె.తిరుపతి పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలపై వివక్ష తగదు

• సమ్మెకు మద్దతు తెల్పిన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్

నవతెలంగాణ-అసిఫాబాద్



ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న వీఓఏల సమ్మెకు మద్దతు తెలిపిన బండారు రవికుమార్

న్యాయమైన డిమాండ్ సాధనకు సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపడం తగదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. గత కొన్ని రోజులు సమస్యల సాధన కోసం కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మెకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. చాలి చాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించి, రూ.10 లక్షల సాధరణ బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలన్నారు. వీఓఏలతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదన్నారు. వారి పైన మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగ ఉన్నందున ఎస్‌హెచ్‌జీ, వీఓఏల లైవ్ సమావేశాలు రద్దు చేయాలన్నారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కారించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, రాజేందర్, రమా, సునీత, వినోద్ గణేష్, కల్పన, శ్రీలత, అర్చన పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ రూరల్‌లో

ప్రగతి భవన్ ముట్టడికి సిద్ధం

కాగజ్‌నగర్ రూరల్ : వీవోఏల సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతిభవన్ ముట్టడికి సిద్ధంగా ఉన్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్ కుమార్ తెలిపారు. మండల ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు చేలడుతున్న సమ్మెలో భాగంగా శుక్రవారం రాత్రి సమ్మెశిబిరంలోనే కుటుంబ సమేతంగా వంటావార్పు, బస చేశారు. ముంజం ఆనంద్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపి కనీస సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18,000 మంది ఐకేపీ వీఓఏలు పోరాటాన్ని తీవ్రతర చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకయ్య, శ్రీనివాస్, వినోద్, వనిత, గీత, సంగీత, సంధ్య, ధనరాజ్, కళ్యాణి, అంజలి, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

• సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధి హామీ పనులు చేపట్టే ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎండలు మండిపోతన్నాయని, రోజుకు పదుల సంఖ్యలో వడదెబ్బతో మృతి చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలలో కూలీలకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయ్యాలన్నారు. గత అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాలలో జరిగిన పనులు ఉపాధి కూలీ డబ్బులు కుడా ఇప్పటి వరకు రాలేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులు కుడా చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో తాము చేసిన పోరాటాల ఫలితంగా తునికాకు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి అటవీ శాఖ ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. జిల్లాలో అనేకమంది తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు 2016 నుండి ఇవ్వడానికి సిద్ధపడినప్పటికీ నేటి వరకు రాలేదని, బోనస్ డబ్బులు చెల్లించని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శవర్గ సభ్యుడు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యుడు అల్లూరి లోకేష్, ముంజం ఆనంద్ కుమార్, దుర్గం రాజ్ కుమార్, నేర్పల్లి అశోక్, రాజేందర్ పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

• ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ రాజేశాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్





రైతుల సంక్షేమానికి ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారు పండించిన దిగుబడులను కొనుగోలు చేస్తోందని, ఈ ప్రక్రియ జిల్లాలో వేగవంతం చేయాని ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ రాజేశాం అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సివిల్ సప్లై మేనేజర్, సహకార శాఖ, వ్యవసాయ శాఖ, ఐకేపీ, మార్క్‌ఫెడ్, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యంతో రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైతు మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైసు మిల్లులలో ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకునే విధంగా అధికారులు రైసు మిల్లుల యజమానుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

• డీపీఓ వెంకటేశ్వర్ రావు

నవతెలంగాణ-కాసిపేట్





ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ముత్యంపల్లి, లంబడితాండ(కె) పంచాయతీల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులను చేపట్టి చెత్తను కంపోస్ట్ షెడ్‌కు తరలించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమల్లో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను గ్రామాల్లో విజయవంతం చేయాలని కోరారు. పల్లె ప్రకృతి వనం, వైకుంటదామం, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించారు. ముత్యంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నిర్ణీత ప్రమాణాలు పాటించని షాపులకు రూ.1000 జరిమానా విధించారు. మొక్కలకు నీరు పోసి వాటిని సంరక్షించాలని ఆదేశించారు.. పంచాయతి రాజ్ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు కృషి చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతి అధికారి నాగరాజు, సర్పంచ్ అడే భాదు, ఉసర్పంచ్ తిరుపతి, ఉపసర్పంచ్ సుమన్, పంచాయతి కార్యదర్శులు మేఘన, సురేష్, సౌందర్య పాల్గొన్నారు.

ఠాగూర్ స్టేడియాన్ని పరిశీలించిన జీఎం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 22 నుండి 24 వరకు నిర్వహించబోయే సీఎం కప్ క్రీడా పోటీలకు సంబందించిన ఏర్పాట్లను శనివారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మైదానాలను తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ చిన్నయ్య, మందమర్రి ఏరియా గ్రౌండ్ ఇన్‌ఛార్జి నస్పూరి తిరుపతి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి

• అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నిర్వహిస్తున్న టచ్ ఆసిఫాబాద్ 2వ విడత కార్యక్రమం ద్వారా జిల్లాలోని విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. శనివారం జిల్లాలో నిర్వహిస్తున్న టచ్ ఆసిఫాబాద్ రెండవ విడత కార్యక్రమంలో భాగంగా పిరమిడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా మారుమూల గిరిజన గ్రామాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మారుమూల గిరిజన గ్రామాలలో మూడు నుండి 16 సంవత్సరాల వయసు గల విద్యార్థుల నుంచి పిరమల్ ఫౌండేషన్ సభ్యులు తెలుసుకున్న సృజనాత్మకత, మౌలిక భాష గుణాత్మక సామర్థ్యం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులు ఇంటి వద్ద ఉంటున్నందున వారిలోని సామర్థ్యాలను బయటకు తీసి వారి అభివృద్ధికి తోడ్పడాలని, జిల్లాలోని ప్రతి గిరిజన గ్రామాన్ని సందర్శించాలని, గ్రామంలోని గ్రామ పటేళ్ళు, పెద్దలు, సర్పంచ్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిరమల్ ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రోగ్రాం మేనేజర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌డీహెచ్‌డీ సంస్థ ఆధ్వర్యంలో నిమ్మ రసం పంపిణీ



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి పట్టణ మార్కెట్ ప్రాంతంలో సెల్ఫ్ డిఫెన్స్ హెల్త్ డిఫెన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ చేతుల మీదుగా నిమ్మ రసం (షర్బత్) పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు ఎండాకాలంలో బయట ఎంత తక్కువ తిరిగితే అంత మంచిదని, మీకు ఏమైనా పనులు ఉంటే ఎండ పెరుగక ముందే పనులు చేసుకొని ఇంటికి చేరుకోవాలని అన్నారు. ఒకవేళ ఎండలో బయటికి వెళితే తగు జాగ్రత్తలు తీసుకొని వెళ్లడం మంచిదని అన్నారు. ఇంటి నుండి బయటికి వెళ్లేటప్పుడు గొడుగు, నీళ్ల బాటిల్ తీసుకొనివెళ్లడం మంచిదని అదేవిధంగా షర్బత్, కొబ్బరి బోండాలు, పండ్ల రసాలు ఎక్కువగా తాగాలని ఇలాంటివి తాగితే మన శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజె రవి, మడ్డి వేణు, ఎండి అజీజుర్ రహ్మాన్, మణిరాజ్, జనార్ధన్, సారంగపాణి పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా పంపిణీ వ్యవస్థలో పనిచేస్తున్న రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని వారికి గౌరవ వేతనం చెల్లించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రామ్మోహన్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్య పరిష్కరించకుంటే వచ్చేనెల 5వ తేదీ నుండి సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో చాలీచాలని కమిషన్ తో తమ కుటుంబాలను పోషించుకుంటూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దిగుమతి హమాలీ ప్రభుత్వం భరించాలన్నారు. ప్రతి ఎమ్ఎల్ఎస్ పాయింట్ వద్ద వేబ్రిడ్జ్ ఏర్పాటు చేయాలన్నారు. కారుణ్య నియామకాలు 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. చనిపోయిన డీలర్‌కు రూ.50 వేలు దహన సంస్కారాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపర్తి శ్రీనివాస్, రాపర్తి నరసయ్య, గోపాల్, తిరుపతి, సుధాకర్, షబ్బీర్, మహేష్, పాండురంగ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్

నవతెలంగాణ-హాజీపూర్



రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం జిల్లాలోని మండలంలోని గాయత్రి పారాబాయిల్డ్ రైస్ మిల్, ఎస్ఆర్ఎస్ రైస్ మిల్, లక్షెట్టిపేట మండలంలోని శ్రీరామచంద్ర పారాబాయిల్డ్ రైస్ మిల్, శ్రీరామ పారాబాయిల్డ్ రైస్ మిల్, శ్రీ శివరామకృష్ణ ట్రేడర్స్ రైస్ మిల్లులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకొని లారీలను తిరిగి పంపించాలని, ఇంటర్మీడియట్ గోదాముల నుంచి వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో సంబంధిత సొమ్ము జమ చేసేందుకు రైస్ మిల్లర్లు ట్రక్ షీట్, ఓఎంపీఎస్‌లో రశీదు తొందరగా ఇవ్వాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి చేసుకోవడంలో ట్రాన్స్‌పోర్టు, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇబ్బందులు కలిగించినట్లయితే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాహుల్ గైక్వాడ్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఏఈఓ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. దుకాణ యజమానులకు సూచనలు చేశారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలు ఉంటే తొలగించాలని సూచించారు. ఇక నుండి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మకం గురించి వివరాలు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



భావితరాలకు వనరులను అందించాలి

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ఆదేశాల మేరకు జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండో రోజు గోలేటి గ్రంథాలయం వద్ద ఇంధన పొదుపు అంశంపై డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహేర యువకులకు అవగాహన కల్పించారు. ఇంధన పొదుపు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనరులను పొదుపుగా వాడుకోవాలన్నారు. ఇంటిలో ఎల్ఈడీ బల్బులు వాడడం, కారులో ఒక్కరు కాకుండా ఎక్కువ మంది ప్రయాణించడం, సౌర విద్యుత్ వినియోగం ప్రయోజనాలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ ఆర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



జీవనోపాధి వృత్తులు లబ్దిదారులకు అందేలా కృషి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

అవకాశం ఉన్న ప్రతి జీవనోపాధి వృత్తులను జిల్లాలోని లబ్దిదారులకు అందేలా ప్రతి శాఖ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ సమావేశం మందిరంలో అధికారులతో స్త్రీ నిధి ఎండి విద్యాసాగర్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో స్త్రీ నిధి డిజీఎం వేణుగోపాల్‌రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మితో కలిసి స్త్రీ నిధి రుణ విధానాలపై సమీక్షించారు. జిల్లాలో పాడి పరిశ్రమ పెరటి కోళ్లు చేపల పెంపకం వ్యూహాత్మకంగా చేపట్టాలని సూచించారు. అలాగే సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు తృణ ధాన్యాల పెంపకం చేపట్టాలన్నారు. జిల్లాలో శ్రీనిధి రుణాల పంపిణీ సంతృప్తికరంగా ఉందన్నారు. సౌరశక్తి, గొర్రెల పెంపకం లాంటివి విరివిగా చేపట్టాలన్నారు. పాడి పెంపకం పట్ల ఏపిఎంలు కృషి చేయాలన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో లవణ మిశ్రమ కేంద్రం, పాల ప్యాకింగ్ కేంద్రం, దూడల పెంపకం చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో కేటాయించిన ప్రత్యేక పథకాలలో 500 పాడి పరిశ్రమ యూనిట్ల, 30 గొర్రెల యూనిట్లు, 600 పెరటి పౌల్ట్రీ యూనిట్లు, విద్యుత్ ఆటోలు 30యూనిట్లు, కూరగాయల సాగు 20 యూనిట్లు, ఎలక్ట్రిక్ టూ వీలర్‌లు 45 యూనిట్లు, జనరిక్ మెడికల్ స్టోర్‌లు 3 యూనిట్లు, హౌసింగ్ రిపేర్‌లు 30 యూనిట్లు, సోలార్ పవర్ యూనిట్లు 350 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

మిశ్రమ సాగు విధానంతో నిరంతర ఆదాయం



నవతెలంగాణ-పెంబి

మిశ్రమ సాగు విధానంలో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు నిరంతర ఆదాయం సమకూరుతుందని ఇటిక్యాల వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం ఇటిక్యాల, పసుపుల రైతులకు మిశ్రమ వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించడంలో భాగంగా హాజీపూర్‌కు చెందిన రైతు ప్రకాష్‌రావుకు చెందిన వ్యవసాయ క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ రైతు ప్రకాష్ రావు తన 20 ఎకరాల భూమిలో డెయిరీతో పాటు వివిధ రకాల పండ్ల తోటలు, సేంద్రియ విధానంలో వరి సాగు, యూకలిప్టస్, కాజురైనా వంటి ఆగ్రో ఫారెస్ట్రీ పంటలను మిశ్రమ విధానంలో సాగు చేస్తూ స్థిర ఆదాయాన్ని అర్జిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానంలో పంటలు పండించడం వల్ల ఒక పంటలో నష్టం వచ్చినా కూడా ఇతర పంటలలో వచ్చే అధిక ఆదాయం వల్ల రైతులపై ఆర్థిక భారం ఉండదని తెలిపారు. మిశ్రమ సాగు విధానంలో ఒక పంటకు సంబంధించిన వ్యర్థాలను ఇంకొక పంటకు ముడి సరుకుగా వినియోంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రూప్ సింగ్, నగవత్ ప్రకాష్, వినాయక్ , నరేందర్, మహేందర్ పాల్గొన్నారు.

లంబాడ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని లంబడ నాయకులు, రైతులు కలిశారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి లంబాడ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఇంద్రవెల్లిలోని శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జెండా ఆవిష్కరణ, ఉట్నూర్‌లో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ స్మృతి వనం కోసం, జీసీసీ పెట్రోల్ బంక్ పక్కన ఆరు గుంటల భూమి కేటాయించాలని, అందుకు సహకరించాలని ఎస్పీని కోరారు. దీనికి ఎస్పీ సానుకూలంగా స్పందించి అందరూ శాంతి భద్రతలకు సహకరించవలసిందిగా సూచించారు. తమ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం శాయశక్తుల కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన ప్రతినిధి బృందంలో లంబాడి జేఏసీ జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామారావు, ఉపాధ్యక్షులు రాథోడ్ శేషారావు, సలహాదారులు జాదవ్ గోపాలరావు, కిషన్ చౌహన్, రూపవత్ అమర్ సింగ్, జాదవ్ మూన్ సింగ్, జాదవ్ వసంతరావు, సంయుక్త కార్యదర్శులు రాథోడ్ సుధాకర్ నాయక్, రాథోడ్ మహేందర్, జాదవ్ సోమేశ్, సంస్కతిక కార్యదర్శి ప్రవీణ్ నాయక్, రూపావత్ ప్రతాప్ ఉన్నారు.

పాడి రైతులకు శిక్షణ

కడెం: మండలంలోని కల్లెడ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయడైరీ వారి సహకారంతో పాడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విజయ డెయిరీ ప్రతినిధి యస్.వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి పశుసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందని దానిలో భాగంగా ఉన్నటువంటి పశువుల సంతతిని పెంచుకోవడానికి విజయ డెయిరీ ద్వారా లోన్ తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఐకేపీ స్త్రీనిధి ద్వారా లోన్ తీసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాలల్లో చిక్కదనం, నాణ్యత, ఉంటే విజయ డెయిరీ ద్వారా పాలకేంద్రం పెట్టుకోడానికి సహకరిస్తామని తెలిపారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా బహు వార్షిక గడ్డి విత్తనాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. వెటర్నరీ డిపార్ట్మెంట్ ద్వారా పశు వైద్య కేంద్రాలు కూడా పెట్టడానికి అవకాశం ఉంటుందని అన్నారు. మహిళా గ్రూప్ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే అదనపు ఆదాయం రావడం తద్వారా మహిళా సాధికారత సాధించడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ఎక్స్‌టెన్షన్ వర్కర్ పున్నం నాయక్, ఈజీయస్ ఫీల్డ్ అసిస్టెంట్ డి.అంజన్న, మహిళా గ్రూప్ లీడర్ జి.మంగ, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వర్షాకాలం ప్రారంభంలోగా వంతెన పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ బొర్కుడె హేమంత్ సహదేవరావు

నవతెలంగాణ - జైనూర్

వర్షాకాలం ప్రారంభంలోగా వంతెన పనులు పూర్తిచేసే విధంగా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కుడె హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం మండలంలోని చింతకర్ర గ్రామంలోని వంతెన నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రూ.4.96 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఈ వంతెన పూర్తయితే చింతకర్ర, కిషన్ నాయక్ తాండ, తాటిగూడ గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించి ప్రభుత్వం వంతెన మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, సర్పంచ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



చర్చలు సఫలం

- కుదిరిన వేజ్‌బోర్డు ఒప్పందం
- జూన్, జూలై నుండి కార్మికులకు పెరుగనున్న జీతభత్యాలు

నవతెలంగాణ-జైపూర్

బొగ్గు గని కార్మికుల 11వ వేజ్‌బోర్డు విషయంలో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. శనివారం సాయంత్రం వేతన ఒప్పందంపై సంతకాలు చేసుకున్నారు. శుక్రవారం జరిపిన చర్చల్లో సూచన ప్రాయంగా కుదిరింది. కలకత్తాలో సమావేశమైన యాజమాన్యం కార్మిక సంఘాలతో జరిపిన చర్చల ద్వారా గతం కంటే కొంత మెరుగైన ఒప్పందానికి యాజమాన్యం అంగీకరించింది. రెండు రోజుల పాటు జరిపిన చర్చల ద్వారా కార్మికులకు గతంలో స్పెషల్ అలవెన్స్ 4శాతం ఉండగా ఇప్పుడు 5 శాతం ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. అదేవిధంగా అండర్ గ్రౌండ్ అలవెన్స్ గతంలో బేసిక్‌పైన 9శాతం ఉంటే ఇప్పుడు 11.25 శాతం అంగీకరించారు. ఇంటి కిరాయి(హెచ్ఆర్ఏ) గతంలో 2శాతం ఉండగా ఇప్పుడు 2.5 పెంచనుంది. రిస్క్ అలవెన్స్ స్టాండైజ్ కమిటీలో వేయనున్నట్లు అంగీకారం కుదిరింది. ఎల్‌టీసీ మీద 25శాతం పెంచనున్నారు. ఎల్‌టీసీ రూ.10వేలకు, ఎల్ఎల్‌టీసీ రూ.12వేల నుండి రూ.15వేలు, పీహెచ్‌డీ ఇప్పుడు 8 రోజుల నుండి 9 రోజులు, అంబేద్కర్ జయంతి పీహెచ్‌డీగా పరిగణించబడుతుంది. లీవ్ విత్ పే 150, పెటర్నిటీ లీవ్స్ 5 రోజులకు అంగీకరించింది. స్టడీ లీవ్ విత్



ఔట్‌వేజెస్ ఇవ్వడానికి, లైవ్ రోస్టర్‌లో అమ్మాయిలకి కూడా 18 సంవత్సరాలు వచ్చే వరకు అవకాశం, ఆర్ఫన్ తల్లి లేదా తండ్రి బేసిక్‌లో 50 శాతం అంగీకరించింది. డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిమెంట్ 9.3, 9.4, 9.5 ప్రకారం డిపెండెంట్ ఉద్యోగాల కొరకు స్టాండర్డజేషన్ కమిటీకి పంపించనున్నారు. అప్పటి వరకు 10వ వేజ్‌బోర్డ్ మాదిరిగానే పరిగణిస్తారు. గత సమావేశంలో స్వీకరించిన విధంగా మినిమం గ్యారంటీ బెన్ఫిట్ 19 శాతం ఇవ్వనుండగా నైట్ షిఫ్ట్ అలవెన్స్ ఒక మస్టరుకు రూ.50 పెంచుతారు. నర్సింగ్ అలవెన్స్ నెలకు రూ.500 చొప్పున ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. యాజమాన్యంతో జరిపిన చర్చల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్ వేజ్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. యాజమాన్యంతో కుదిరిన ఒప్పందపై ప్రభుత్వం నుండి అనుమతి లభించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నుండి అనుమతి అందిన వెంటనే పెరిగిన జీతభత్యాలు జూన్, జూలై నుండి చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తామని కోలిండియా చైర్మెన్ తెలిపినట్లు కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం



నవతెలంగాణ-ఉట్నూర్

బడుగు, బలహీనం వర్గాల కోసం వంద రోజుల ఉపాధి హామీ చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టించి నిర్వీర్యం చేస్తోందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో ఆయన పర్యటించి ఉపాధి హామీ కూలీల పనులను పరిశీలించారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వెంటనే తాగడానికి నీరు, మెడికల్ కిట్, వాహన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీ డబ్బులు వారం వారం చెల్లించాలని, మజ్జిగ ప్యాకెట్లను అందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జెడ్పీటీసీ రాథోడ్ చారులత సైతం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలకు పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దూట రాజేశ్వర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ జైవంత్‌రావు, యూత్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ మొబిన్ ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాలు అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రజాహితం కోసం స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠం వద్ద స్వాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెరుగన్నం పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం స్వాస్ ఆధ్వర్యంలో పెరుగన్నం పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కేంద్రాన్ని ప్రారంభించి నిర్వాహకులతో కలిసి పెరుగన్నం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవికాలం తీవ్రమైన ఎండల దృష్ట్యా పెరుగన్నం పంపిణీకి శ్రీకారం చుట్టిన స్వాస్ ప్రతినిధులను అభినందించారు. ఇదే స్పూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, స్వాస్ అధ్యక్షులు కారింగుల ప్రణయ్, మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి, గంగారెడ్డి, అరె నరేష్ , ఊరే గణేష్, బాల శంకర్‌కృష్ణ పాల్గొన్నారు.

మంత్రిగా బీసీలకు ఏ చేశారో చెప్పాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీని విమర్శించే ముందు మంత్రిగా ఉన్నప్పుడు బిసిలకు ఎమ్మెల్యే జోగు రామన్న ఏం చేశారో చెప్పాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ బిసి డిక్లరేషన్ ప్రకటించగానే ఎమ్మెల్యే జోగు రామన్న భయంతో మీడియా ముందు ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నారని తెలిపారు. రామన్న రాజకీయ ఎదుగుదలకు కారణమైన బిసిల కోసం బిసి మంత్రి ఉన్నప్పుడు ఏం చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. బిసిని ప్రధానమంత్రి చేసి 27మందిని కేంద్ర మంత్రులుగా చేసి వారిలో 5 గురికి క్యాబినెట్ హోదా కల్పించిన ఘటన బీజేపికి దక్కుతుందన్నారు. బిసి కమిషన్‌కు జాతీయ హోదా కల్పించడంతో పాటు నవోదయ, సైనిక్ స్కూల్‌లో విద్యార్థులకు 27శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. జూన్‌లో జరిగే బిసి డిక్లరేషన్‌ను విజయవంతం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. సమావేశంలో నాయకులు క్రాంతి కుమార్, తాటి సతీష్, కొత్తపల్లి సంతోష్, తోకల నరేష్, రాము గెడం, కొడప సోనేరావ్, అశాంత్, కాంత, కిరణ్ చహకటి, రుతిక్ పాల్గొన్నారు.

ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు కృషి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ఆరె కులస్తులకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఓబీసీ సర్టిఫికెట్ ఇప్పించేందుకు కృషి చేస్తానని బీజేపీ తాలుకా నాయకులు పాల్వాయి హరీష్ అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి గడప గడపకు బీజేపీ కార్యక్రమం13వ రోజు శనివారం మోసం, ఆరెగూడ గ్రామాల్లో కొనసాగింది. గ్రామస్తులు భాజాభజంత్రీలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. బీజేపీ జెండావిష్కరణ అనంతరం పాదయాత్రగా వెళ్తూ గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఆరె కులస్తులకు ఓబీసీ ధృవీకరణ పత్రం అందించేందుకు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పోడు రైతులకు న్యాయం చేసే విధంగా రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోడు ఎద్ల లాగా పనిచేసి డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ప్రతి నిరుపేదకు స్లాబ్ ఇల్లు కట్టించే బాధ్యత భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమ్మనగంటి సాంబయ్య, సర్పంచులు పుల్ల అశోక్, ధోతుల శ్రీను, బిమన్కర్ గణపతి, బిమన్కర్ బాపురావు, చాప్లే జై, కుందారపు సుమన్, చౌదరి సాయి, బోడకుంట తిరుపతి, అల్లి చిరంజీవి, విగ్నేష్, అంబిలపు ఉపేందర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఎండకు ముందే పనులు చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉపాధి హామి కూలీలు ఎండకు ముందే పనులు పూర్తి చేయాలని డీఆర్డీఓ కిషన్ అన్నారు. శనివారం మండలంలోని దనోరా(బి) గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామి పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఎండను దృష్టిలో ఉంచుకొని, ఎండకు ముందే పనులు పూర్తి చేసుకుని 10గంటలలోపే ఇంటికి వెళ్లాలని అన్నారు. అకౌంట్‌లలో డబ్బులు వారం వారం పడుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న చోటు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తాము ఇచ్చిన పోస్టల్ ఖాతాలో డబ్బులు పడకుండా ఇతర అకౌంట్లో జమా కావడంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నామని అన్నారు. పోస్టల్ అకౌంట్లో చెల్లింపులు జమ కావాలని విన్నవించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించారు. మొక్కలు ఎండపోకుండా నీళ్ల పోయాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ పుష్పలత, ఉపసర్పంచ్ సంతోష్ మహారాజ్, టీఏ పృథ్వీరాజ్, ఎఫ్ఏ నజీర్ ఉన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రంతో పాటు మాక్స్ సొసైటీలో శనివారం వ్యవసాయ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో రైతులు నకిలీ విత్తనాల బారిన పడి మోసపోకుండా అధికారులు విత్తన డీలర్ల వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ నారాయణ్‌నాయక్ మాట్లాడుతూ అనుమతి లేని పత్తి, వరి విత్తనాలు విక్రయించకూడదన్నారు. ప్రతి రైతుకు విధిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఎవరైన నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి అసం రవి, ఎస్సై రజనీకాంత్ పాల్గొన్నారు.

షాపింగ్ మాల్స్‌లో షీటీమ్ పర్యటన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీ టీం ఇన్చార్జ్, ఏఎస్ఐ సునీత సూచించారు. శనివారం పట్టణంలోని పలు షాపింగ్ మాల్స్‌లో మహిళా సిబ్బందికి షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురైన వెంటనే షీ టీ నెంబర్ 8712659953 ఫోన్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సైబర్ నేరాలు, 1930 నంబర్, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, ఫోక్స్ యాక్ట్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆమె తెలిపారు.

రేపు జొన్న రైతుల ధర్నాను విజయవంతం చేద్దాం

నవతెలంగాణ-తాంసి

ఈనెల 22న సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే జొన్న రైతుల దర్నాను విజయవంతం చేద్దామని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బోర్రన్న అన్నారు. శనివారం తాంసి మండలంలోని కప్పర్ల, బండల్‌నాగపూర్ గ్రామలో జొన్నలు నిల్వ ఉన్న రైతులతో కలిసి జొన్న నిల్వలను పరిశీలించారు. ధర్నా విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 రబి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ నోడల్ ఏజీన్సిగా జొన్న పంటను సేకరిస్తున్న దృశ్యం కనబడుతుందని అన్నారు. కానీ ఈ సంవత్సరం ఎకరానికి 5.16 క్వింటాళ్ళ జొన్న పంటను మాత్రమే రైతుల నుండి కొనుగోలు చేయడం సరైంది కాదని అన్నారు. రైతు పండించిన పంట పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని అన్నారు. రైతులు పండించిన పంట పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రాస్తారోకోలు ధర్నాలు చేస్తామని అన్నారు. ఈ ధర్నాలో రైతులందరు పాల్గొని, విజయవంతం చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, రమేష్, మహేందర్, రామారావు, రమాకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫామ్స్ త్వరగా కుట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాఠశాల విద్యార్థుల రెండు జతల ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్ జూన్ 1లోపు పూర్తి కావాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సుజత్‌ఖాన్ సూచించారు. శనివారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో నిర్వహిస్తున్న స్టిచింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు చంద్రశేఖర్‌ను కలిశారు. తగిన సూచనలు చేసి బట్టలన్నీ సకాలంలో కుట్టాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులందరూ యూనిఫామ్ స్టిచ్చింగ్ పురోగతిని టైలర్స్, పేరెంట్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలుసుకుని వేగంగా పూర్తి చేయాలన్నారు.

నేడు పోటీ పరీక్షల ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు అయిదు నెలల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.రమేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వంద మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఉచిత శిక్షణ జూన్ 1 నుండి ప్రారంభమవుతుందన్నారు.